ఆయన రూటే సెపరేటు


తూర్పు రైల్వేస్టేషన్ నుంచి బాలాజీపేట రోడ్డు


బొమ్మూరు రాఘవేంద్రకాలనీ నుంచి బాలాజీపేట సెంటర్ రోడ్డు

- శంకుస్థాపన చేసిన కొద్ది రోజుల్లోనే రోడ్ల నిర్మాణం
- వాహన చోదకులకు తప్పిన ఇక్కట్లు
- మంత్రి వేణు చొరవకు ప్రజల్లో హర్షాతిరేకాలు

రాజమహేంద్రవరం రూరల్: ఒకప్పుడు ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి బొమ్మూరు వరకున్న ఆర్‌అండ్‌బీ రోడ్డుతో పాటు, తూర్పు రైల్వేస్టేషన్ నుంచి బాలాజీపేటకు వచ్చే రోడ్డులో ప్రయాణించాలంటేనే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రూరల్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించడంతో ఈ నియోజకవర్గంలో అనేక సమస్యలకు మోక్షం లభించింది. వీటిలో రోడ్ల నిర్మాణం సైతం పూర్తికావడంతో రయ్‌రయ్ అంటూ వాహనాలు దూసుకుపోతున్నాయి. దీని వివరాలు ఇలా ఉన్నాయి. ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి బొమ్మూరు వరకున్న ఆర్‌అండ్‌బీ గోతులమయంగా ఉండేది. అంతేకాకుండా రైతుబజార్ వద్ద కల్వర్టు సైతం శిథిలావస్థకు చేరింది. ఇది చూసిన మంత్రి వేణుగోపాలకృష్ణ వెంటనే జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడడంతో పాటు, త్వరితగతిన రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టారు. ఐఎల్‌టీడీ ఫ్లెటైవర్ నుంచి బొమ్మూరు వరకూ ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం చకచకా పూర్తి చేశారు. అలాగే శంభూనగర్ రైతుబజార్ వద్ద నగరపాలక సంస్థ నిధులతో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు, త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. నగరపాలక సంస్థ 16వ డివిజన్ పరిధిలో తూర్పు రైల్వేస్టేషన్ నుంచి బాలాజీపేట సెంటర్ వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో మంత్రి వేణుగోపాలకృష్ణ నగరపాలక సంస్థ నిధులతో రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో వాహనచోదకులు ప్రయాణం సాఫీగా సాగుతోంది. గతంలో రోడ్లు అధ్వానంగా ఉండడంతో అనేక ఇబ్బందులు పడిన ప్రజలు.. రోడ్ల నిర్మాణం పూర్తికావడంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న సమయంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి.. శిలాఫలకాల మంత్రి అని వేణుగోపాలకృష్ణను ఎద్దేవా చేసినా పట్టించుకోలేదు. ప్రజలకు మాటిస్తే దానిని తప్పక అమలు చేసి, ఆచరణలో చూపిన వేణుగోపాలకృష్ణను సేవ చేసే మంత్రిగా ఆయా ప్రాంతాల ప్రజలు కొనియాడుతున్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం


శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న డా.కృష్ణసందీప్, రాజబాబు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలో కేపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దివంగత కోటంశెట్టి వెంకాయమ్మ, కోటంశెట్టి అప్పలనరసమ్మ జ్ఞాపకార్థం కోటంశెట్టి రాజబాబు ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వివిధ విభాగాల వైద్య నిపుణులు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య నిపుణులు కృష్ణసందీప్, రామ్‌గోపాల్‌తేజ కోట్ల, పేపకాయల మాణిక్యాంబ వైద్య సేవలందించారు. అదేవిధంగా హుకుంపేట పంచాయతీ కార్యాలయం ఎదురుగా కేపీఆర్ ఫౌండేషన్, కేపీఆర్ వాటర్‌ప్లాంట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

ఉప్పలూరి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న ఉప్పలూరి రాము తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్‌సీపీ రూరల్ మండల అధ్యక్షుడు, వెంకటనగరం మాజీ సర్పంచ్ ఉప్పలూరి వీర వెంకట సత్యనారాయణ జన్మదినం సందర్భంగా బుధవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. లాలా చెరువు వద్ద ఉన్న స్వర్ణాంధ్ర వృద్ధ ఆశ్రమంలో వృద్ధులకు నిత్యావసర సరకులు, జియోన్ పాఠశాలలో పిల్లలకు భోజన ఏర్పాటు, నిత్యావసర సరకులు అందజేశారు. అలాగే పుష్కరాలరేవులో 200 మందికి ఆహార పొట్లాలను అందించారు. అంతకుముందు తొర్రేడులోని బాలాజీ టౌన్‌షిప్‌లో ఉప్పలూరి రాము ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ప్రయాణికులకు మజ్జిగ, చెరకు రసం, స్వీట్లు పంపిణీ చేశారు.

ఘనంగా ప్రపంచ హోమియో దినోత్సవం

కంబాలచెరువు: ప్రపంచ హోమియో దినోత్సవాన్ని స్థానిక వై జంక్షన్‌లోని డాక్టర్ అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియో కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. హోమియో పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ విగ్రహానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిప్రసాద్ పుష్పమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఎంతటి దీర్ఘకాలిక రోగాన్నైనా చక్కగా నయం చేసి, ఎందరో రోగుల పాలిట, పేదల పాలిట సంజీవనిగా పేరొందిన హోమియో వైద్యం చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నగరంలో ప్రఖ్యాత హోమియో వైద్యులు, సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ ధనుంజయను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీఎంఓ డాక్టర్ హరినాథ్, డాక్టర్ తిలక్, డాక్టర్ కె.సాహితీసుధ, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రదానం


జోగినాయుడు(ఫైల్)

ధవళేశ్వరం: నిడదవోలులోని రామాయమ్మ ఇంటర్నేషనల్ ఐ–బ్యాంక్‌కు స్థానిక జంగాలవీధికి చెందిన గవర జోగి నాయుడు(85) నేత్రాలను ఆయన కుమారుడు నేత్రదానం చేశారు. జోగి నాయుడు బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు ఇంట్లో జారిపడి మృతి చెందారు. మరొకరి జీవితంలో వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో ఆయన కుమారుడు గవర వరప్రసాద్, రమేష్ నిడదవోలులోని ఐ–బ్యాంక్‌కు నేత్రదానం కోసం సమాచారం అందజేశారు. ఐ బ్యాంక్ సిబ్బంది వచ్చి జోగి నాయుడు కార్నియాలను సేకరించారు. తండ్రి నేత్రాలను దానం చేసిన కుమారులను పెన్షనర్ల సంఘ నాయకుడు యర్రమోతు ధర్మరాజు అభినందించారు.

సినిమాలు

శ్యామల	: గీతాంజలి మళ్లీ వచ్చింది
సూర్యమినీ	: మైదాన్
సూర్యప్యాలెస్	: మంజుమ్మల్ బాయ్స్
స్వామి	: ది ఫ్యామిలీ స్టార్
శివజ్యోతి	: లవ్‌గురు
అనుశ్రీ	: మంజుమ్మల్ బాయ్స్
రాజా	: బడేమియా చోటేమియా
ఊర్వశి	: శ్రీరంగనీతులు
రంభ	: బడేమియా చోటేమియా
మేనక	: ప్రాజెక్టు 2
అప్సర	: టిల్లు స్క్వేర్
కుమారి	: టిల్లు స్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్	: ది ఫ్యామిలీ స్టార్, లవ్‌గురు
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ది ఫ్యామిలీ స్టార్, టిల్లు స్క్వేర్
కడియం	
వెంకటసూర్య	: గీతాంజలి మళ్లీ వచ్చింది


కుసుమ నాగన్న స్కూలులో రంజాన్ వేడుకలు

కంబాలచెరువు: కోర్లమ్మపేటలో ఉన్న కుసుమ నాగన్న ప్రాథమిక పాఠశాలలో బుధవారం రంజాన్ వేడుకలు నిర్వహించారు. ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థుల్లో సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలని, తమ పాఠశాలలో అన్ని మతాల పండగలు నిర్వహిస్తామని హెచ్‌ఎం సేవా రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా రంజాన్ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని దీదీప్య పాల్గొన్నారు.

సమాజ దార్శనికుడు పూలే

ప్రకాశం నగర్: సమాన హక్కుల కోసం, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధి కోసం సమాజంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన దార్శనికుడు మహాత్మా జ్యోతీరావు పూలే అని వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి పిల్లి సత్య రమేష్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ, కళా గౌతమి సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్య వివక్ష, పేదరిక నిర్మూలన, ఆర్థిక సమానత్వం కోసం పూలే ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు అధ్యక్షత వహించారు. తెలుగు శాఖ అధ్యక్షుడు పీవీబీ సంజీవరావు, అధ్యాపకులు, ఎస్.రాజ్‌కుమార్, పల్లి సుధా పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


మంత్రి వేణుగోపాలకృష్ణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన కింగ్ శ్రీను తదితరులు

ధవళేశ్వరం: టీడీపీ నుంచి ధవళేశ్వరం కొత్తపేటకు చెందిన సుమారు 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా రాజబాబు, నక్కా రాజేంద్ర, పేట రామకృష్ణ ఆధ్వర్యంలో రెల్లి సంఘం నాయకుడు మంగళగిరి శ్రీను(కింగ్ శ్రీను)తో పాటు, 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్టు వెల్లడించారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి మస్తాన్ బేగ్, ఎస్ అనిల్, కర్రి శ్రీను, ఎల్ వెంకటరమణ, జీడి సతీష్, మంగళగిరి మనోజ్‌కుమార్, మోరంపూడి తేజ, పూజారి, కంతేటి రామ్మోహనరావు, దనాల దుర్గాప్రసాద్, దనాల వెంకట్రావు, బుంగ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నరేన్ సమక్షంలో..


పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న చెల్లుబోయిన నరేన్ తదితరులు

కడియం: పొట్టిలంక గ్రామానికి చెందిన పలువురు జనసేన, టీడీపీ నాయకులు మంత్రి చెల్లుబోయిన వేణు కుమారుడు చెల్లుబోయిన నరేన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ మేరకు మంగళవారం రాత్రి పొట్టిలంక పార్టీ కార్యాలయం వద్ద సర్పంచ్ కొత్తపల్లి సత్యవతీ వేంకటేశ్వరరావు, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి నరేన్ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి తాము పార్టీలో చేరుతున్నట్టు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో గూడూరి చక్రవర్తి, కట్టా శ్రీను, పంపన నాగరాజు, బత్తిన అజయ్, గూడూరి సత్యనారాయణ, కట్టా చిన్నా, గొంగల గంగరాజు, జుత్తుక విజయ్‌కుమార్, గుబ్బల సుబ్బారావు, ఉండమట్ల జార్జిప్రకాష్, కట్టా శ్రీనివాసు, చంటిబాబు తదితరులు ఉన్నారు.

నామినేషన్ల దాఖలులో జాగ్రత్త వహించాలి

ఆర్‌ఓ, జేసీ తేజ్‌భరత్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల దాఖలు విషయంలో జాగ్రత్త వహించాలని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సాధారణ ఎన్నికలు–2024కు సంబంధించి నామినేషన్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించి, ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వివరాలపై అధికారులకు సూచనలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ నామినేషన్ రోజున అభ్యర్థితో పాటు, మరో నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియపై సందేహాలుంటే హెల్ప్‌డెస్క్ సాయం తీసుకోవచ్చన్నారు. నమూనా నామినేషన్ల పరిశీలన చేయాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియను సక్రమంగా చేస్తున్నారో, లేదో తెలుసుకోవడానికి చెక్‌లిస్ట్ ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జేసీ చాంబర్‌లో అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. అభ్యర్థి, ప్రతిపాదన చేసే వ్యక్తి, మరో ముగ్గురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఇతర పోలింగ్ అధికారి (ఓపీఓ), మైక్రో అబ్జర్వర్‌గా తమ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వేయడానికి రాజమహేంద్రవరం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఫారం–12 సేకరణ కేంద్రం ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగిన ఇతర పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్ ఫారం–12 దరఖాస్తుతో పాటు, వారికి జారీ చేసిన డ్యూటీ ఆర్డర్, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కాపీని సమర్పించాల్సి ఉంటుందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేకరణ కేంద్రంలో ఈ నెల 22న ఆయా వివరాలు నేరుగా అందజేయాలని చెప్పారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్‌వీబీఎస్ ఆచారి(బీజేపీ), జి.సత్యనారాయణ(టీడీపీ), కె.రామకృష్ణ(సీపీఎం), చెల్లుబోయిన నరేన్(వైఎస్సార్ సీపీ), రూరల్ తహసీల్దార్ వైకేవీ అప్పారావు, కడియం తహసీల్దార్ బి.రమాదేవి, ప్లానింగ్ అధికారి కోటయ్య, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

8 మంది వలంటీర్ల రాజీనామా


పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

రాజానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సకాలంలో అందజేస్తూ, నిస్వార్థ సేవలను అందిస్తున్న తమపై ప్రతిపక్ష నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని నిరసన తెలుపుతూ స్థానిక మూడు గ్రామ సచివాలయాలకు చెందిన ఎనిమిది మంది గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేశారు. తమ రాజీనామాలను పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రసాద్‌కు బుధవారం అందజేశారు. ఎన్నికల కమిషన్ కూడా తమను వలంటీర్ విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం మనస్తాపానికి గురిచేసిందని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ స్వచ్ఛందంగా తప్పుకోవాలని ఈ రాజీనామా చేస్తున్నట్టుగా తమ రాజీనామా పత్రాల్లో పేర్కొన్నారు.

ఉండ్రాజవరం మండల సర్వసభ్య సమావేశం

ఉండ్రాజవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి అభివృద్ధి పనులతోపాటు, సమస్యలపై చర్చించడానికి అవకాశం లేదన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉన్నందున ఈ సమావేశం నిర్వహించామని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత నిర్వహించే సమావేశంలో అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, వైస్ ఎంపీపీ నరహరిశెట్టి సరోజ, మండల కో ఆప్షన్ మెంబర్ షేక్ షాజహాన్, మండల పరిషత్ కార్యాలయ ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెళ్లపిళ్ల ఉగాది పురస్కారాల అందజేత


పురస్కారాలు అందిస్తున్న ప్రముఖులు

కడియం: ఉగాది సందర్భంగా చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి కళాసేవా సమితి ఆధ్వర్యంలో రచనరత్న పురస్కారాలు అందించారు. క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు స్థానిక మినర్వా పబ్లిక్ స్కూల్లో మంగళవారం రాత్రి సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా సాహిత్యం–జర్నలిజానికి సంబంధించి సాహితీ సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్త సామాజిక విశ్లేషకులు మలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ సాహిత్యం, జర్నలిజం ప్రజలను చైతన్య పరచడానికి ఎంతో దోహదపడతాయన్నారు. ముఖ్యఅతిథులు ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర కార్యదర్శి మండెల శ్రీరామమూర్తి, ఎంఈఓ వై.నాగేశ్వరరావు, మినర్వా స్కూల్ అధినేత చొదళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సేవా సమితి చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. వివిధ రంగాలకు చెందిన కొండ్రెడ్డి శ్రీనివాస్, గొల్లపల్లి సత్యనారాయణ, గొడవర్తి శ్రీనివాసుకు రచనారత్న పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు తోరాటి వసంతరావు, దేవరపు నీలకంఠరావు, కొప్పిశెట్టి చంటి, ఉంగరాల వీరభద్రరావు, బోణం సత్యనారాయణ, చిక్కాల ఈశ్వరరావు, బడిగంటి భూసియ్య, దంగేటి నాగేంద్ర, తోకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీమాతో ధీమా

- పేదలకు కొండంత అండ
- రేషన్ కార్డుదారులకు వర్తింపు
- లబ్ధిదారుల వివరాల సేకరణలో యంత్రాంగం


సీతానగరంలో వైఎస్సార్ బీమాకు వివరాలు సేకరిస్తున్న వలంటీర్ (ఫైల్)

సీతానగరం: ప్రమాదవశాత్తు కానీ, సహజ మరణంతో కానీ ఇంటి యజమాని చనిపోతే.. ఏ పేద, సామాన్య కుటుంబం రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూపొందించిన ఈ పథకం అమలు బాధ్యతను పూర్తిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకుంది. గతంలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఈ పథకం అమలయ్యేది. అయితే సక్రమంగా అమలు జరగని కారణంగా కేంద్ర ప్రభుత్వం తన వాటా ఆర్థిక సాయాన్ని నిలిపివేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో మొత్తం ప్రీమియంను భరిస్తూ వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తోంది. నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా, రైస్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబాన్ని పోషించే వ్యక్తి దురదృష్టవశాత్తు మరణించినా.. ఆ వ్యక్తిపై ఆధారపడిన కుటుంబం రోడ్డునపడరాదని ఈ బీమా పథకం భారాన్ని ప్రభుత్వం తీసుకుంది. వలంటీర్ల ద్వారా అధికారులు సర్వే చేయించి, లబ్ధిదారుల వివరాలు నమోదు చేసుకున్నారు. నియోజకవర్గంలోని సీతానగరం మండలంలో 23,640, కోరుకొండ మండలంలో 25,651, రాజానగరం మండలంలో 32,895 రైస్ కార్డులున్నాయి.

రైస్ కార్డు ఉంటే అర్హులే..

వైఎస్సార్ బీమా పథకం కింద రైస్‌కార్డ్ కలిగిన ప్రతి లబ్ధిదారు అర్హుడే. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల వివరాలు, బ్యాంకు ఖాతా, నామినీ వివరాలు సేకరించారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

– కృష్ణప్రసాద్, ఎంపీడీఓ, సీతానగరం

పథకానికి అర్హతలు..

- ఈ పథకంలో నమోదు కావాలంటే తప్పనిసరిగా రైస్ కార్డు ఉండాలి. కుటుంబాన్ని పోషించే వ్యక్తికే బీమా వర్తిస్తుంది.
- ఆ వ్యక్తికి భార్య/ 21 ఏళ్లు పూర్తికాని కుమారుడు/ పెళ్లికాని కుమార్తె/ వితంతువు అయిన కూతురు బీమాదారునితో ఉంటే/ బీమాదారునిపై ఆధారపడిన తల్లిదండ్రులు/ వితంతువు అయిన కోడలు లేదా ఆమె పిల్లలు నామినీగా ఉంటారు. భర్త చనిపోతే ఆ స్థానంలో భార్య ఉంటే ఆమె పేరున బీమా కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేల లోపు ఆదాయం కలిగి ఉండాలి. మాగాణి 2.5 ఎకరాలు, మెట్ట 5 ఎకరాల లోపు ఉండాలి. ఏదైనా జాతీయ బ్యాంకులో ఖాతా ఉండాలి.

ప్రయోజనాలివే..

వైఎస్సార్ బీమా పథకంలో నమోదైన 18 నుంచి 50 ఏళ్ల వయస్సు వారు సహజ మరణం పొందితే రూ.2 లక్షలు, ప్రమాదశాత్తు మరణిస్తే రూ.5 లక్షల బీమా వర్తిస్తుంది. 51 నుంచి 60 ఏళ్ల వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.3 లక్షల బీమా వస్తుంది. బీమాదారునికి గుర్తింపు కార్డు ఇస్తారు. క్లెయిమ్ సొమ్ము నేరుగా వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. ఈ ఖాతా ఎప్పుడూ వినియోగంలో ఉండాలి.

రోగి మృతిపై బంధువుల ఆందోళన

కంబాలచెరువు: చికిత్స పొందుతున్న రోగి మృతిచెందిన సంఘటనపై నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద బుధవారం మృతుడి బంధువులు ఆందోళన నిర్వహించారు. అంతర్వేది ప్రాంతానికి చెందిన మోహనరావు (60) తీవ్ర జ్వరంతో 15 రోజుల క్రితం ఆస్పత్రిలో చేరాడు. అతనికి కిడ్నీలు, ఇతర అవయవాలు పాడయ్యాయి. ఈ నేపథ్యంలో అతని చికిత్స కోసం రూ.9 లక్షల వరకు ఖర్చయింది. మోహనరావు పరిస్థితి విషమించి చనిపోయాడు. అప్పటికే అతడి కుటుంబ సభ్యులు ఆస్పత్రి బిల్లు రూ.7 లక్షల వరకు చెల్లించారు.

మిగతా సొమ్ము చెల్లించి, మృతదేహాన్ని తీసుకెళ్లాలని ఆస్పత్రి సిబ్బంది చెప్పడంతో, మృతుడి బంధువులు ఆందోళన చేశారు. మిగతా సొమ్ము చెల్లించలేమని, మృతదేహం తమకు అవసరం లేదని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. దీనిపై ఆస్పత్రి యాజమాన్యానికి, మృతుడి బంధువుల మధ్య చర్చలు జరుగుతున్నాయి.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.విజయకుమార్

పెదపూడి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.విజయకుమార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని జి.మామిడాడ రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులు రోడ్డుపై ఆరబోసిన ధాన్యం నమూనాని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. కనీసం మద్దతు ధర 75 కేజీలకు గాను రూ.1,635, ఏ గ్రేడ్ రకానికైతే 75 కేజీలకు రూ.1,652 చెల్లిస్తామన్నారు. తేమ శాతం 17 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి మణిదీప్, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన సదస్సు


ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

రాజానగరం: ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ సక్రమంగా, నిజాయితీగా వినియోగించాలని వక్తలు సూచించారు. కరెన్సీ నోటుకు అమ్ముడుపోకుండా, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉపయోగించాలన్నారు. అనంతరం కార్యాలయం నుంచి సాయిబాబా గుడి సెంటరుకు చేరుకుని, ప్లకార్డులతో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లను చైతన్యపరిచారు. ఎంపీడీఓ జ్యోతిర్మయి, ఎంఈఓ రామన్నదొర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.